ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 22 జూలై 2024

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు



రైల్వేకోడూరు సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం వేకువజామునే పూజారులు సాయిబాబాను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీల నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ట్రిపుల్‌ఐటీల్లో 4400 సీట్ల భర్తీకి శ్రీకారం

● నేటి నుంచి అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, జూలై 21: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు కోసం అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో 4400 సీట్లు భర్తీ చేయనున్నారు. ఈనెల 22 నుంచి 27 వరకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1100 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించనున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెంట్రల్ లైబ్రరీలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆధ్వర్యంలో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అధ్యాపకులకు, సిబ్బందికి కౌన్సెలింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఇడుపులపాయకు సంబంధించి ఇడుపులపాయ క్యాంపస్‌లో 22, 23 తేదీల్లో, నూజివీడు ట్రిపుల్‌ఐటీకి సంబంధించి అదే క్యాంపస్‌లో 22, 23 తేదీల్లో జరుగుతాయి. ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో చేరే విద్యార్థులకు 24, 25 తేదీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్ కౌన్సెలింగ్ జరుగుతుంది. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చేరే విద్యార్థులకు 26, 27 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లోనే ఈ అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇప్పటికే ఆయా విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపారు. వెబ్ సైట్‌లో చూపించిన విధంగా ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని అధికారులు తెలిపారు.

బుర్రకథ కళాకారిణి లక్ష్మీదేవికి సినిమా ఛాన్స్

● పవన్‌కళ్యాణ్ సినిమాలో పాటపాడే అవకాశం



తమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మీదేవి

లక్కిరెడ్డిపల్లె, జూలై 21: లక్కిరెడ్డిపల్లెకు చెందిన బుర్రకథ కళాకారిణి లక్ష్మీదేవికి పవన్ కళ్యాణ్ నటించబోవు ఓజీ సినిమాలో పాట పాడడానికి అవకాశం దక్కింది. ఈనెల 14వ తేదీ ఆహా టీవీలో సీజన్ -3 ఇండియన్ తెలుగు ఐడల్ కార్యక్రమంలో భాగంగా 'గ్రామవాసులు జానపద గేయాలు' కార్యక్ర మంలో పాల్గొన్న ఆమె సుండుపల్లె సంతకుపోయి సున్నాలు తెస్తావా అనే జానపదగేయం పాట పాడింది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆ పాటను మెచ్చుకుని మెమెంటోతో పాటు నగదు అందజేసి అభినందించారు. అంతేకాకుండా పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ నటించబోవు ఓజీ అనే సినిమాలో పాట పాడే అవకాశం కల్పిస్తున్నట్లు కూడా సంగీత దర్శకుడు తమన్ సభావేదిక మీద ఆమెకు చెప్పినట్లు టీటీడీ అన్నమయ్య సంకీర్తన హార్మోనిస్ట్ మహదేవ తెలిపారు. లక్ష్మీదేవి బుర్రకథలు, రేడియోలో జానపదగేయాలు ఆలపించేది. శుభకార్యాలకు బుర్రకథలు చెప్పేది. రేడియో సంపాదకులు జయసింహ సహకారంతో ఆహా టీవీలో వస్తున్న తెలుగు ఐడల్ కార్యక్రమంలో పాల్గొని పాటలను ఆలపించింది. దీంతో గాయకురాలు గీతామాధురి, సంగీత దర్శకుడు తమన్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడంతో పాటు సినిమాలో పాట పాడే అవకాశం దక్కింది.

అధికారం మనదే... అడిగే నాథుడెవరు... ఇక్కడ పెద్దాయన మాటను కాదనే అధికారం ఎవరికీ లేదు... ఆర్థికంగా బలంగా ఉన్నాం.. పేపర్ వద్దు, ప్రొసీజరూ లేదు.. ఎంత కావాలంటే అంత డబ్బు తీసుకో.. అప్పటికప్పుడే లైన్ లాగేయ్.. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేయ్ అన్న రీతిలో గత ఐదేళ్లు వైసీపీ నాయకుల హవా నడిచింది. ఇలా ఈ అయిదేళ్లు చేసినట్లే..వచ్చే అయిదేళ్లూ కూడా అధికారం మాదే అనుకున్నట్లుంది. అవకాశం ఉన్న అన్ని చోట్లా, అన్ని మార్గాల్లో తమ మార్కు పనితనం చూపించారు. కాలం కాస్త కలసి రాకపోవడంతో అది రివర్స్ అయింది. అక్రమాల గుట్టు ఒక్కొక్కటిగా రట్టవుతోంది.



తెట్టు రోడ్డుకు ఆనుకుని డీకేటీ భూమిలో చేపట్టిన నిర్మాణాలు

అడ్డంగా దొరికారు..!

● డీకేటీలో రిసార్ట్ నిర్మాణం
● అనధికారికంగా విద్యుత్తు లైన్
● అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
● విజిలెన్స్ విచారణ.. కరెంట్ కట్

మదనపల్లె, జూలై 21: వైసీపీ ఏలుబడిలో తాలిబాన్ రాజ్యంగా ముద్రపడిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్తు శాఖను ఊడ్చేసిన విషయం తెలిసిందే. వీటిలో ఏ విధంగా? ఎలా అక్రమాలు చేశారో వివరిస్తూ ఇటీవల ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వెలువడ్డాయి. ఇందులో భాగంగా రెవెన్యూలో భూకబ్జాలు, రికార్డుల మార్పుపై అంతర్గత విచారణకు సిద్ధం అవుతుండగా, విద్యుత్తు శాఖపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ముఖ్యంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్రాన్స్‌కో కాంట్రాక్టర్ ఆ శాఖాధికారులు, సిబ్బందితో కలసి చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా తమ పార్టీకి చెందిన అనుయాయునికి లబ్ధి చేకూర్చే క్రమంలో అనధికారికంగా విద్యుత్తు లైన్ లాగారు. ఇందులో ఇతరుల పేరున మంజూరైన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఇక్కడ ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్తు సరఫరా ఆపేశారు.

విద్యుత్తు శాఖలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుండగా, అలాంటి మరో అక్రమం కూడా వెలుగులోకి వచ్చింది. అప్పటికి చేసిందే తప్పు పని అయితే, అలాంటి తప్పే మరొకటి చేసి దొరికిపోయారు. అధికారం, ఆర్థికబలం ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఫలితాలు ఎలా ఉంటాయనే దానికి ఇదే ఉదాహరణగా చెప్పవచ్చు. ఇందులో అధికార పెద్దలు అండగా ఉన్నారని విద్యుత్తు కాంట్రాక్టర్ మరొకరి ట్రాన్స్‌ఫార్మర్‌ను అప్పటి అధికార పార్టీ వైసీపీ అనుయాయుడి పొలంలో అమర్చాడు. అలాగే ఆర్థికంగా బలంగా ఉన్నాం.. పేపర్ వద్దు, ప్రొసీజరూ లేదు.. ఎంత కావాలంటే అంత డబ్బు తీసుకో.. అప్పటికప్పుడే లైన్ లాగేయ్.. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేయ్ అనడం వైసీపీ అనుయాయుడి ఆదేశమైంది. ఇలా ఈ అయిదేళ్లు చేసినట్లే..వచ్చే అయిదేళ్లూ కూడా అధికారం మాదే అనుకున్నట్లుంది. అవకాశం ఉన్న అన్ని చోట్లా, అన్ని మార్గాల్లో తమ మార్కు పనితనం చూపించారు. కాలం కాస్త కలసి రాకపోవడంతో అది రివర్స్ అయింది. అక్రమాల గుట్టు ఒక్కొక్కటిగా రట్టయిన ఉదంతమిది.

కురబలకోట మండలం తెట్టు రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-671 బ్లాక్‌లో గత ప్రభుత్వం పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చింది. మూర్తినాయునిపల్లె సమీపంలోని దిగువపల్లెకు చెందిన ఓ రైతు నుంచి ఈ భూమిని కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. తెట్టు నుంచి విశ్వం కళాశాల వద్ద కలిసే ప్రధాన జాతీయ రహదారిని కలిపే రోడ్డు పక్కన ఈ భూమిని మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతాన్ని చదును చేసిన వైసీపీ మద్దతుదారుడు అందులో రిసార్ట్ తరహాలో రెండు భవనాలు నిర్మించాడు. అలాగే చుట్టూ కంచెతో పాటు విద్యుత్తు లైట్లు, సీసీ పుటేజీ కెమెరాలు కూడా అమర్చాడు. ఇక్కడ మొక్కలు నాటడంతో పాటు బోరు వేయించి 25 కె.వి.వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్, ఇక్కడి భవనాలు, కంచె చుట్టూ విద్యుత్తు అవసరానికి మరో 15 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఆ భూమి మొత్తం తెట్టు రోడ్డుకు ఆనుకుని ఉండటంతో రైతు నుంచి కొనుగోలు చేసి రిసార్ట్ తరహాలో నిర్మాణాలు చేపట్టారు.



రోడ్డు పక్కన 11 కె.వి. నుంచి లాగిన విద్యుత్తు లైన్



ఒకే దిమ్మెపై ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లు

అడుగడుగునా.. ఉల్లంఘనే

ఈ వ్యవహారంలో అడుగడుగునా ఉల్లంఘన జరిగినట్లు తెలుస్తోంది. భూమి లేని నిరుపేద రైతుకు జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం అసైన్‌మెంటు పట్టా ఇస్తుంది. దీనిని రైతు సాగు చేసుకోవాలే కానీ..ఇతరులకు అమ్మకూడదు. కొనకూడదు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో కొనుగోలు చేసినా.. అందులో వ్యవసాయం చేసుకోవాలే కానీ..నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ ఇక్కడ విలాసవంతమైన నిర్మాణాలు చేపట్టారు. చుట్టూ ఇనుప కంచె, విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేశారు. ఇదే తప్పు అనుకుంటే, ఇందుకు కావాల్సిన విద్యుత్తు సరఫరాలోనూ తప్పటడుగు వేసి తప్పు మీద తప్పు చేసి అడ్డంగా దొరికిపోయారు. సాధారణంగా పొలానికో లేక ఇంటికో విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలంటే ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంటు లేదా వన్‌బీ, అడంగల్, వీఆర్వో నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్ రైతు లేదా యజమాని విద్యుత్ శాఖాధికారులకు ఇవ్వాలి. ఆ తర్వాతే ఆ లైన్‌కు సంబంధించి ఎస్టిమేట్ పూర్తయి డబ్బులు చెల్లిస్తే సీనియారిటీ ప్రకారం కనెక్షన్ మంజూరు చేస్తారు. కానీ ఇక్కడ అదేమీ లేకుండా డబ్బులు కొట్టు.. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టు అనే రీతిలో వ్యవహరించారు ట్రాన్స్‌కో అధికారులు, కాంట్రాక్టర్. తెట్టు రోడ్డుకు ఆనుకుని అటుగా అప్పటికే వెళుతున్న 11 కె.వి.లైన్ నుంచి కట్ పాయింట్ తీసుకుని, ఇక్కడి భూమికి ప్రత్యేకంగా లైన్ లాగారు. ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. ఇటు బోరుకు, ఇటు భవనాలకు విద్యుత్ సరఫరా చేశారు. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌ను పీటీఎం మండలంలో ఓ రైతు పేరున మంజూరైన దానిని తీసుకొచ్చి ఇక్కడ అమ్మేశారు. అలాగే ఇదే తరహాలో మరో 15 కె.వి. రౌండ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఎక్కడో తెచ్చి ఇక్కడ అనధికారికంగా ఏర్పాటు చేశారు.

ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఇదేనేమో..!

ఇక్కడ ఏర్పాటు చేసిన రెండో 15 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్ అదేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ (బుడ్డీ)ను అనధికారికంగా తీసుకొచ్చారు. దీనిని మదనపల్లె-కడప జాతీయ రహదారి పక్కన ముదివేడు సమీపంలోని ఇసుక డంప్‌కు ఏర్పాటు చేసి ఉండేవారు. ఇక్కడి నుంచి అప్పట్లో జగనన్న ఇళ్లకు ఇసుక సరఫరా చేసే కేంద్రం ఇది. రైల్వేస్టేషన్ వద్ద తీసుకొచ్చి ఇక్కడ అప్పటికప్పుడే లాగిన విద్యుత్తులైన్‌కు అమర్చి విద్యుత్తు సరఫరా చేశారు. తర్వాత అక్కడ ఇసుక ఖాళీ కావడంతో విద్యుత్తు స్తంభానికి ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసేశారు. అయితే తిరిగి అదే స్థలంలోని రైల్వేస్టేషన్ వద్ద బిగించలేదు. కానీ ఎక్కడుందో విద్యుత్తు శాఖ సిబ్బంది అంతు చిక్కని ఈ వ్యవహారంపై అప్పట్లో చర్చించారు. కానీ ఉన్నఫళంగా ఇప్పుడు తెట్టు సమీపంలో విజిలెన్స్ తనిఖీలో బయటపడటంపై అది ఇదేనేమోనని ఆ శాఖలో చర్చ సాగుతోంది. విజిలెన్స్ నివేదికతో మేల్కొన్న ట్రాన్స్‌కో అధికారులు ఈ అక్రమ వ్యవహారానికి సంబంధించి విద్యుత్తు సరఫరా ఆపేశారు. అనధికారికంగా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేసి, సరఫరా చేయడం అంటే ఆ శాఖలో చౌర్యం కిందనే పరిగణిస్తున్నారు. అదే తరహాలో మిగిలిన అయిదు మండలాల్లోనూ జరగడంతో విజిలెన్స్ ఎక్కడ వచ్చి ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. చేసింది అధికార బలం అయినా.. అధికారికంగా తామే బాధ్యత వహించాల్సి వస్తుందని భయపడుతున్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

● గోవింద నామంతో మార్మోగిన నందలూరు



రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు, జూలై 21: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు సునీల్‌శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవాన్ని ముందుకు కదిలించారు. రథోత్సవానికి పెద్దఎత్తున హాజరైన భక్తుల గోవిందనామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మన్నూరు సీఐ మంజునాథరెడ్డి, ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, ప్రముఖ నటుడు, దర్శకుడు తోట వేణుగోపాల్, రాజంపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యెద్దల విజయసాగర్, గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి రెడ్డయ్య, బోయలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత జీఎన్ నాయుడు ఆధ్వర్యంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు స్వాతి, ఏవో శివ, విద్యార్థుల పర్యవేక్షణలో రథోత్సవానికి విచ్చేసిన దాదాపు 2 వేల మందికి అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు చక్రస్నానం


బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



రథోత్సవం ముందు కోలాటం

వైభవంగా కోదండరాముడి కల్యాణం

ఒంటిమిట్ట, జూలై 21: ఏకశిలా నగరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద కల్యాణతంతును ప్రారంభించారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, అనంతరం యజ్ఞోపవితరణ నిర్వహించి వైష్ణవ సంప్రదాయంలో వేదపండితులు సీతమ్మ తల్లికి మాంగల్యధారణ చేయించారు. అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండుల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వ్యాఖ్యాత గానుగపెంట హనుమంతరావు భక్తులకు సీతారాముల కల్యాణం విశిష్ట సందేశాన్ని తెలియజేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు విచ్చేశారు.



కల్యాణం అనంతరం ఆశీనులైన సీతారాములు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మెడికల్ కాలేజి నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దు

● ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి

మదనపల్లె టౌన్, జూలై 21: మదనపల్లె మెడికల్ కాలేజి భవన నిర్మాణ నాణ్యతలో రాజీపడొద్దని ఏపీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆనందరెడ్డి ఆదేశించారు. ఆదివారం స్థానిక సర్వజన బోధనాస్పత్రిపై నూతనంగా నిర్మించిన భవనాలు, పడకగదులు, ఆపరేషన్ థియేటర్లను ఎస్ఈ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల నిర్మాణాలు, పెయింటింగ్‌లు, బాత్రూం తలుపుల ఫిట్టింగ్‌లు అసంపూర్తిగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మొదటిఫ్లోర్‌పై వేసిన ఇనుప ట్రస్సులు, రేకులను చివరి వరకు వేయకుండా కేవలం ఒక్క అడుగు మాత్రమే వేయడం చూసి ఆశ్చర్యపోయారు. వర్షం వస్తే నీరంతా లోపలికి వచ్చే ఆస్కారం ఉందని, దీనివలన ఫాల్‌సీలింగ్ తడిచి లోపల ఊరిసే అవకాశం ఉందని గుర్తించారు. వెంటనే వీటి స్థానంలో అదనంగా రేకులు బిగించి వర్షపునీరు లోనికి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్‌కు కేటాయించిన గదిలో విన్నైల్ ఫ్లోరింగ్ సరిగ్గా లేదని, దీనిని తీసివేసి కొత్తవి వేయాలని ఆదేశించారు. మొదటి ఫ్లోర్‌లోకి రోగులను తీసుకెళ్లే ర్యాంపు డిజైన్ మార్చాల్సి ఉందని, ర్యాంపు పొడవు, ఎత్తు పెంచి ఎక్కువ వాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పనులు దగ్గరుండి చేయించకుంటే ఇలాగే అంతంతమాత్రం ఫినిషింగ్ ఉంటాయని డీఈ కరీముల్లాను సుతిమెత్తగా హెచ్చరించారు. ఈఈ అరవిందదేవి మాట్లాడుతూ సబ్ ఇంజనీర్లు, వర్కర్లను ఎక్కువగా ఆస్పత్రి భవన నిర్మాణ పనులకే కేటాయించారని, ఆరోగ్యవరం వద్ద పనులు ఆలస్యంగా జరగడానికి ఇదో కారణమన్నారు. రెండు నెలల్లో మెడికల్ కాలేజి భవనాలను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని, మొదటి ఎల్‌వోపీకి అనుమతి వచ్చే విధంగా కాంట్రాక్టు కంపెనీతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మెగా ప్రాజెక్టు మేనేజర్, ఇంజనీర్లు పాల్గొన్నారు.



భవనాలను తనిఖీ చేస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి

ఆలస్యంగా నడిచిన పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు

● 4 గంటలు ఆలస్యం... ప్రయాణీకుల అవస్థలు

ములకలచెరువు, జూలై 21: సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు (12732) ఆలస్యంగా నడిచింది. ములకలచెరువు మీదుగా నడిచే ఈ రైలు నాలుగు గంటలు ఆలస్యం కావడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారానికి రెండు రోజులు నడిచే పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్, గుంతకల్లు, అనంతపురం, కదిరి, ములకలచెరువు, మదనపల్లె రోడ్, కలికిరి, పీలేరు, పాకాల జంక్షన్ మీదుగా తిరుపతికి వెళుతుంది. ఈ రైలు ములకలచెరువుకు ఆదివారం తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 6.49 గంటలకు వచ్చింది. 4 గంటలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణీకులు అవస్థలు పడాల్సి వచ్చింది. సాంకేతిక కారణాలతో రైలు ఆలస్యంగా బయలుదేరిందని రైల్వే అధికారులు తెలిపారు. అలాగే ఈ రైలు మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.17 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటకు రావాల్సి ఉండగా ఉదయం 7.46 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.59 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సి ఉండగా 9.14 గంటలకు చేరింది. అలాగే తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు నడిచే రాత్రి ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 3.01 గంటలకు వచ్చింది.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా?

తల్లిదండ్రుల ఆశలు నెరవేరేనా? పదేళ్లుగా ప్రతిపాదనలతోనే....

పోరుమామిళ్ల, జూలై 21: పురుషులతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకుంటున్న నేటి సమాజంలో ఇప్పటికీ మహిళలు దూరంగా వెళ్లి చదువుకోవాలంటే అనేక రకాల ఇబ్బందులు తప్పడంలేదు. మహిళలకు ప్రత్యేకించి డిగ్రీ కళాశాల కేటాయించకపోవడంతో కొందరు మధ్యలోనే చదువును నిలిపేస్తున్నారు. అనేక గ్రామాలకు కేంద్ర బిందువైన పోరుమామిళ్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే గ్రామీణ మహిళలు మరింత ఉన్నత చదువు చదివే అవకాశం ఉంది. వివరాల్లోకెళితే....

నేటి సమాజంలో విద్యార్థులతో సమానంగా విద్యార్థినులు ఏ మాత్రం తీసిపోనీకుండా చదివించడంలో తల్లిదండ్రులు వెనుకాడడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో దూరంగా చదివించాలంటే కొందరు ఆలోచన చేస్తున్నారు. అందుబాటులో ఉండే విద్యా సంస్థలైతే తమకు అనుకూలంగా ఉంటాయని సాయంత్రం కల్లా ఇంటికి చేరుస్తారనే ధీమా వారిది. పోరుమామిళ్లలో ప్రైవేటు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు కూడా ఉన్నాయి. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లోని గ్రామీణులు వేలాది మంది విద్యార్థులు, విద్యార్థినులు విద్యాభ్యాసం కోసం పోరుమామిళ్లకు వచ్చి వెళుతుంటారు. కానీ అబ్బాయిలకు డిగ్రీ వరకూ అవకాశాలున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోఎడ్యుకేషన్ ఉన్నప్పటికీ అమ్మాయిల తల్లిదండ్రులు అంత దూరం పంపాలంటే కాస్త ఆలోచిస్తున్నారు. మహిళా డిగ్రీకళాశాల ఉంటే అనుకూలంగా ఉంటుంది కదా అనే ఆలోచనలు కూడా వారిలో తలెత్తాయి. చాలామంది విద్యార్థతలు ఉండి కూడా ఆర్థిక పరిస్థితి లేని వారు ఇంటర్ చదువుకే స్వస్తి పలుకుతున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు నెల్లూరు, విజయవాడ, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు పంపి పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తున్నారు. మధ్యతరగతి పేదవర్గీయులు మాత్రం చదివిన కాడికి చాల్లే తమ పరిస్థితి ఇంత వరకే చదివిద్దాం అని సర్దుకుపోతున్నారు. దీంతో దాదాపు వందలాది విద్యార్థినులు ప్రతిభ ఉండీ విద్యను కొనసాగించ లేకపోతున్నారు. పదేళ్ల కిందట పోరుమామిళ్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పుర ప్రముఖులు, పెద్దలు కలిసి కలెక్టరు, ఆర్‌జేడీకి ప్రతిపాదనలు పంపారు. యూనివర్శిటీ వీసీ వినతిపత్రాలు అందించారు. కానీ స్థల సమస్య ఏర్పడడంతో ఆలోచనలో పడ్డారు. దాదాపు రెండున్నర ఎకరాలో ఉండే కళాశాల, హాస్టల్‌కు రెండూ వసతులు కల్పించేందుకు వీలుగా ఉంటుందని అంచనాలు వేశారు. అప్పట్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపున దాదాపు రెండున్నర ఎకరాలు స్థలం కేటాయించేందుకు నిర్ణయాలు తీసుకున్నా ఆ స్థలం ఎవరు రిజిస్ట్రేషన్ చేయిస్తారనేది ప్రశ్నగా మారింది. కళాశాల మైదానం, ఎనిమిదెకరాలకు పైగా ఉన్న ఆ ప్రాంతంలో కళాశాల వెనుక వైపున అయితే బాగుంటుంది, ఊరికి మధ్యలో ఉంటుందని, విద్యార్థినులకు సెక్యూరిటీగా అనుకూలంగా ఉంటుందనే అంచనాలు వేసినా కార్యరూపం దాల్చలేకపోయింది. అప్పటి రాజకీయ పరిణామాలు, స్థలం రిజిస్ట్రేషన్ చేయించేదెవరు అన్న ప్రశ్నలు స్థానికుల్లో తలెత్తినా ప్రయత్నాలు మాత్రం కొనసాగించారు. ప్రతిసారీ ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళుతున్నా కార్యరూపం దాల్చేలా ఎవరూ ముందుకు రాలేదు. ఫలితంగా చాలా మంది గ్రామీణ విద్యార్థులు ఇంటర్‌తోనే స్వస్తి పలుకుతూ తమ భవిష్యత్తు ఇంటర్‌లోనే నిలిపివేస్తున్నారు. ఎవరైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వ స్థలాల్లో మహిళా డిగ్రీకళాశాలకు స్థలం కేటాయించేలా కళాశాల నిర్మాణం జరిగేలా నిధుల కోసం అధికారులు, నేతలతో చర్చించి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటే పోరుమామిళ్ల పరిసర ప్రాంత బాలికలకు అనుకూలంగా ఉన్నత విద్య చదివేందుకు అవకాశం ఇప్పించినవారవుతారు. మరి పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఈ ప్రాంతం చుట్టుపక్కలకు కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఏర్పాటైతే ఎందరో బాలబాలికలకు ఉన్నతవిద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే అవకాశం ఉంది.


మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని యూనివర్శిటీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న పోరుమామిళ్ల వాసులు (ఫైల్)

మహిళా కళాశాల కోసం ప్రయత్నాలు చేశాం



పోరువమామిళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనక వైపు స్థలం కేటాయించేందుకు అప్పట్లో అధికారులతో మాట్లాడాం. మహిళా డిగ్రీ కళాశాలకు హాస్టలు వసతికి దాదాపు రెండున్నర ఎకరా స్థలం అవసరం అవుతుందని అంచనా వేశారు. పోరుమామిళ్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటైతే బాలికలకు ఉన్నత విద్య అందుతుందని అప్పటి కలెక్టరు, ఆర్‌జేడీకి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు వచ్చిన అధికారులకు వినతి పత్రాలు కూడా అందించాం. స్థల సేకరణే ప్రశ్నగా మిగలడంతో ఎవరూ ముందుకు రాలేదు.

- గురుమూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రభుత్వం మారిందీ...

జగన్, రాచమల్లు ఫొటోలే పెడతారా ! ● ఇది మున్సిపల్ కార్యాలయం... మీ ఇల్లు కాదు

నందం సుబ్బయ్యను చంపినప్పుడు బీసీ మాటెత్తలేదే... ● రాజన్న క్యాంటిన్ ఎప్పుడు తెరుస్తారు ?

వైసీపీ చైర్‌పర్సన్ వైస్‌చైర్మెన్ల ఆరోపణలపై భగ్గుమన్న టీడీపీ కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 21: "ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చెల్లుచీటి ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 45 రోజులు దాటుతున్నా ఇంకా మున్సిపల్ కార్యాలయంలో సీఎం, ఫొటోను మార్చలేదు. ఇది మున్సిపల్ కార్యాలయం మీఇల్లు కాదు. నందం సుబ్బయ్యను చంపినప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా, పేదల కోసం రాజన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు ఎప్పుడని" టీడీపీ కౌన్సిలరు వంగనూరు మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని మురళీధర్‌రెడ్డి కార్యాలయంలో కౌన్సిలర్లు వైఎస్ మహ్మద్‌గౌస్, మునీర్, మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డితో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం మారినా మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకుండా మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ జగన్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఫొటోలు పెట్టడంపై అభ్యంతర పెడితే టీడీపీ దౌర్జన్యం చేస్తోందని, బీసీ మహిళా చైర్‌పర్సన్‌ను అవమాన పరుస్తోందని ప్రజలను తప్పుదోవ పట్టించే ఆరోపణలు చేయడంపై టీడీపీ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. చైర్‌పర్సన్ చాంబర్ అనేది ప్రభుత్వ కార్యాలయం అని వైసీపీ ఆఫీసు కాదని, మీ ఇల్లు అంతకన్నాకాదని గుర్తుంచుకోవాలన్నారు. బీసీ నేత నందం సుబ్బయ్యను దారుణంగా చంపినప్పుడు, ఎమ్మెల్సీ రమేష్‌ను బెదిరించినప్పుడు గుర్తుకు రానీ బీసీ పదం మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలు ఇంకా ఎలా ఉంచుతారని ప్రశ్నించినందుకు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మెన్ బంగారురెడ్డికి బీసీ పదం గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. మూడేళ్లలో కౌన్సిల్‌లో ఆమోదించడమైనది, తిరస్కరించడమైనది అనే రెండు మాటలు తప్ప స్వతంత్రంగా మరో మాట మాట్లాడారా అని ప్రశ్నించారు. బావా బామర్ధులు రాచమల్లు, బంగారురెడ్డి బీసీ చైర్‌పర్సన్‌గా మీకు విలువ ఇచ్చారా అని ప్రశ్నించారు. మూడేళ్లలో ఒక్కరోజైనా చైర్‌పర్సన్‌గా ఒక్క కౌన్సిలర్‌కు లెటర్ ఇవ్వడం, అధికారులతో సమావేశం నిర్వహించడం, పట్టణంలో స్వతంత్రంగా తిరగడానికి మీకు వారు అనుమతినిచ్చారా అని ప్రశ్నించారు. మా దేవుడు ఫొటో తొలగిస్తారా అని మాట్లాడిన చైర్‌పర్సన్ లక్ష్మీదేవికి రాచమల్లు దేవుడైతే మీ ఇంట్లో పెట్టుకుని పూజలు చేసుకోండన్నారు. కడప కార్పొరేషన్‌లో మాజీ సీఎం జగన్ ఫొటోలున్నాయని చెబుతున్నారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఎమ్మెల్యేల ఫొటోలు లేవన్నారు. అలా ప్రభుత్వ ఉత్తర్వులు లేవన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా మా అన్న ఆజ్ఞతో 11 ఏళ్లు రాజన్న క్యాంటిన్ ద్వారా పేదలకు అన్నం పెడతానని చెప్పిన రాచమల్లు ఎన్నికలు అయిపోయినా ఎందుకు తెరవలేదన్నారు. ప్రజలు రాచమల్లు ఏర్పాటు చేసే రాజన్న క్యాంటిన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మా నాయకుడు సీఎం సురేష్‌నాయుడు ఎన్నికల వరకు అన్నాక్యాంటిన్ పెడతామని, ఆ తరువాత మా ప్రభుత్వం అన్నాక్యాంటిన్‌లు పెడుతుందని చెప్పారన్నారు. కూరగాయల మార్కెట్ ప్లాన్ బాగుందని మా నాయకుడు కొండారెడ్డి చెప్పాడని అందులో జరిగిన అవినీతి గురించి ఇంకా మాట్లాడలేదన్నారు. మార్కెట్ నిర్మాణం కాకముందే కాంట్రాక్టర్ నుంచి రాచమల్లు పర్సెంటేజీలు తీసుకున్నారని ఆరోపించారు. తాత్కాలిక మార్కెట్‌లో రూ.5కోట్లు దోచుకున్నారని ఎక్కడైనా ప్రమాణం చేస్తానన్నారు. ఏ బండ, ఏ గది ఎంతకు అమ్ముకున్నారో చెబుతామన్నారు. రాచమల్లు ప్రమాణాలకు అనర్హుడని బంగారురెడ్డి, చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ప్రమాణానికి ముందుకు రాగలరా అని సవాల్ విసిరారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

బి.కొత్తకోట, జూలై 21: ఇంటి ముందున్న నీటి సంపులో పడి బాలుడు నిఖిలేష్(2) మృతి చెందాడు. ఆదివారం బి.కొత్తకోటలో జరిగిన సంఘటనపై వివరాల్లోకెళితే.... బాబా టాకీస్ వీధికి చెందిన బాబు కుమారుడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందున్న నీటి సంపులో పడిపోయాడు. కుటుంబీకులు గమనించకపోవడంతో నీటిలో పడి మృత్యువాత పడ్డాడు.

లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(మారుతీనగర్), జూలై 21: వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు, విశేష సేవలందిస్తున్న ప్రముఖులను 2024 సంవత్సరానికి గుర్తించి వారికి ఆగస్టు 10న లెజెండరీ, బంగారు నంది పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ భారత ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్మారక దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత, నృత్య, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, విద్య, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు, సాహిత్య, జానపద రంగాలకు చెందిన వారితోపాటు కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సినీ, టీవీ కళాకారులు, దర్శక, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, న్యాయవాదులు, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారు పూర్తి వివరాలతో 30లోగా దరఖాస్తులను 6302908528, 9705313061 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. అవార్డు గ్రహీతల ఎంపికలో న్యాయ నిర్ణేతలదే అంతిమ నిర్ణయమని తెలిపారు.

విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి


షాలోమ్ అనాథాశ్రమంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలుటౌన్, జులై 21: విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు సానపురెడ్డి రామగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి సహకారంతో షాలోమ్ అనాథాశ్రమంలోని పిల్లలకు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి నుంచి రూ.25వేలు విలువైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఏపీ పెన్షనర్స్ సంఘంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ఉద్యోగం చేస్తూ, ఇంటికి వచ్చిన తరువాత ఇంటి వద్ద పేదపిల్లలకు ఉచితంగా విద్యాబుద్దులు నేర్పించి ఆదర్శప్రాయుడయ్యారన్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తుండేవారన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ సంఘం అసోషియేట్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆనందాన్నిచ్చిన పుష్పగిరి క్షేత్ర దర్శనం

తాళ్ళపాక అన్నమాచార్య వంశస్తులు నారాయణాచార్యులు


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న నారాయణాచార్యులు, భక్త బృందం

వల్లూరు, జూలై 21: ప్రసిద్ధి గాంచిన పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించడం ఎంతో ఆనందాన్ని కలగజేసిందని తాళ్ళపాక అన్నమాచార్య వంశీకులు నారాయణాచార్యులు అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి ఆహ్వానం మేరకు నారాయణాచార్యులు పుష్పగిరి క్షేత్రానికి వచ్చారు. దేవాలయం వారు వారిని ఘనంగా ఆహ్వానించారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవ, సంతాన మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో అర్చకులు ఘనంగా సన్మానించారు. అర్చకులు పుష్పగిరి క్షేత్రం మహత్యాన్ని ఆయనకు వివరించారు. అనంతరం స్థానిక భక్తులతో కలిసి టెంకాయలు కొట్టి హారతి అందించి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నారాయణాచార్యులు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణతో సకల శుభాలు కలుగుతాయని, భక్తులు ఏక కాలంలో శివకేశవులను దర్శించడం ఒక భాగ్యమైతే దిగువన ప్రవహిస్తున్న పంచమనదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఈ హరిహర వేద క్షేత్రాన్ని దర్శిస్తే అన్ని కోరికలు నెరవేరుతాయన్నారు. గిరి ప్రదక్షిణ చేయడం వలన ప్రతి ఇంటా శుభాలు జరుగుతాయన్నారు. వీరి వెంట భారవి, బసిరెడ్డి, టీటీడీ బృందం, విశ్వనాథరెడ్డి, ఆలయ అర్చకులు అఖిల్, సుమంత్ దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గండి క్షేత్రంలో టెండర్లు

చక్రాయపేట, జూలై 21: సోమవారం ఉదయం 10 గంటలకు గండి వీరాంజనేయస్వామి కార్యాలయంలో దేవస్థానం ఆవరణలో పూలు విక్రయం, దేవస్థానంలో టోల్‌గేట్ వసూలుకు టెండర్లు పిలవనున్నట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఒక్కో దానికి రూ.5లక్షలు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనాలని కోరారు. శ్రావణంమాసం లో పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణ, స్వాగత తోరణాలు, చలువపందిళ్లు, బారికేడ్లు, ఫొటోలు, వీడియోలు రికార్డు చేసి ఇచ్చేందుకు, భజంత్రీ లు ఏర్పాటుకు సీల్డ్ టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. కావున ఆసక్తి ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

కడప క్రైం, జూలై 21: కడప నగరం ఎర్రముక్కపల్లె రైల్వేగేట్ సమీపంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఒకరిపై దాడి చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సికెదిన్నె మండలం పెద్ద ముసలరెడ్డిపల్లె వాసి బాలకృష్ణారెడ్డి సొంత పని నిమిత్తం 18న ద్విచక్ర వాహనంలో కడపకు వస్తుండగా ఎర్రముక్కపల్లె సమీపంలో నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. గాయపడ్డ వ్యక్తికి వారి బంధువులకు భూ వివాదం ఉండడంతో దాడి చేసింటారని అనుమానిస్తున్నారు.

'ఈగల్ డిస్టిలరీస్'పై విజిలెన్స్ తనిఖీ

కడప క్రైమ్, జూలై 21: చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల సమీపంలోని ఈగల్ డిస్టి లరీస్ ఫ్యాక్టరీ (మద్యం తయారీ కేంద్రం)లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీ చేపట్టింది. 16 గంటల పాటు అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేపట్టారు. రికార్డులు స్టాక్ వివరాలు, గోడౌన్ తరలింపు వివరాలను పరిశీలించారు. మద్యం తయారీ కేంద్రంలో 9సి హార్స్ విస్కీ బ్రాండ్‌లను తయారు చేస్తారు. అధికారులు మద్యాన్ని శాం పిల్ తీసి మంగళగిరిలోని ల్యాబ్‌కు టెస్టింగ్ కోసం పంపించారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఈదుర్‌బాషా,ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణకుమార్, డిస్టిలరీస్ సీఐ తులసి పాల్గొన్నారు.

చిరిగిన ఫ్లెక్సీ తీగలపై పడితే....


హోర్డింగ్ చిరిగి వేలాడుతున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జూలై 20: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద ఓ ప్రైవేట్ వ్యాపార సంస్థ మూడంతస్తుల బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (హోర్డింగ్) చిరిగిపోయింది. గాలికి కొట్టుకుంటుండడంతో బారీగా శబ్దం వస్తోంది. గాలికి ఎగిరి కిందపడితే దీని వల్ల ప్రమాదం పొంచి వుంది. ముఖ్యంగా వాహనాలు నడిపేవారిపై పడితే వాహనాలు ఢీకొట్టుకునే ప్రమాదం లేకపోలేదు. విద్యుత్ వైర్లపై పడితే కూడా ప్రమాదం ఉందని, వెంటనే దానిని తీసివేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఆహ్లాదకరంగా సాగుతున్న స్కౌట్ శిక్షణ


శిక్షణ కార్యక్రమం దృశ్యం

కడప (స్పోర్ట్స్) జూలై 21: హజ్మాడి స్కౌట్ హాలులో ఏడు రోజుల పాటు జరుగుతున్న స్కౌట్ బేసిక్ శిక్షణలో భాగంగా మూడోరోజు ఆదివారం జిల్లాలోని కబ్, స్కౌట్, రోవర్ మాస్టర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. శిక్షణకు సుమారు 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా స్కౌట్ ప్రాధాన్యత, ప్రధాన ఉద్దేశాలు, ఉపయోగాలు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణానంతరం ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలల్లో యూనిట్‌ను ఎలా నిర్వహించాలి తదితర విషయాలను పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో స్కౌట్ కార్యదర్శి ప్రమీల, స్కౌట్ అసోసియేషన్ ట్రెజరర్ శివశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, జిలానిబాష, ఖాదర్ బాష, లక్ష్మీకర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి

వల్లూరు జూలై 21: కడప తాడిపత్రి జాతీయ రహదారి సత్యాగ్రీన్ సిటీవద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పాలవ్యాపారి ప్రసాద్‌రెడ్డి (46) మృతి చెందినట్లు వల్లూరు ఏఎస్‌ఐ మోహన్‌రావు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు పెండ్లిమర్రి మండలం కొండూరు వాసి కడపలో నివాసం వుంటూ రోజూ వల్లూరు మండలానికి వచ్చి ఇంటింటా పాలు సేకరించి కడపలో అమ్ముకునేవాడని తెలిపారు. ఆ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పాలు పట్టుకునేందుకు వస్తుండగా సత్యాగ్రీన్ సిటీ వద్ద గుర్తు లెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడి కక్కడే చనిపోయాడని తెలిపారు. ఘటనా స్థలికి ఎస్‌ఐ కత్తి వెంకటరమణ వచ్చి ప్రమాదానికి గల కారణాలు, వివరాలను అడగి తెలుసుకున్నారు. అనంతరం శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపడతామని తెలిపారు.

శిక్షణ ఇవ్వరు - మిషన్లు పంపిణీ చేయరు

'ఐకేపీ'లో నిరుపయోగంగా 60 కుట్టుమిషన్లు


పెనగలూరు ఐకేపీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న కుట్టు మిషన్లు

పెనగలూరు, జూలై 21: మండల పరిధి నిరుద్యోగ డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించే నిమిత్తం ఏపీ ఎండీసీ మంగంపేట ప్రాజెక్టు ఆధ్వ ర్యంలో పెనగలూరు ఐకేపీ కార్యాలయానికి 60 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అయితే ఎన్నికలకోడ్ సాకుతో నాలుగు నెలలుగా 60 కుట్టుమిషన్‌లు ఐకేపీ కార్యాలయంలో మూలనపడి తుప్పు పట్టిపోతున్నాయి. ఇదిలా ఉండగా శిక్షణకు ఎన్నిక చేసిన 60 మంది నిరుద్యోగ మహిళలు శిక్షణ కోసం, కుట్టు మిషన్ల పంపిణీ కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికలు ముగిసి ఫలితా లు వెలువడి, ఎన్నికల కోడ్ కూడా ముగిసి నెలన్నర కావస్తున్నా ఐకేపీ కార్యాలయంలో కుట్టు మిషన్ల శిక్షణ గురించి కాని, పంపిణీ చేసే కార్యక్ర మం కానీ జరగలేదు. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ రాక ముందు 20 రోజులు కోడ్ వస్తుందనగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొం డూరు అజయ్‌రెడ్డి ద్వారా ఐకేపీ ఏరియా కోఆర్డినే టర్ నిరంజన్‌కుమార్ శిక్షణకు శ్రీకారం చుట్టారు.

మళ్లీ ఏమైందో ఏమోగానీ ఐదు రోజులకే ఎన్ని కలకోడ్ సాకుతో శిక్షణను నిలిపేశారు. అప్పటి నుంచి మూడు నెలలుగా శిక్షణ కార్యక్రమం పూర్తి గా ఆగిపోయింది. ఐకేపీ కార్యాలయంలో కుట్టు మిషన్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నా రు. నిరుద్యోగుల కోసం మంజూరు చేసిన కుట్టు మిషన్లు కూడా ఇచ్చామంటే ఇచ్చామ న్నట్లు నాణ్యత లేని మిషన్లు అని కొద్ది రోజు లు శిక్షణకు వెళ్లిన మహిళలు ఆరోపిస్తున్నారు.

కొన్ని నెలలుగా మిష న్లు మూలన పడి ఉండగా తుప్పు పట్టిపోతున్నాయని అంటున్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెనగలూరు ఐకేపీ కార్యాలయంలో నిరుప యోగంగా ఉన్న కుట్టుషన్ల శిక్షణ, పంపిణీపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతు న్నారు. ఈ విషయంపై ఏసీ, ఏపీఎం నిరంజ న్‌కుమార్‌ను వివరణ కోరగా కుట్టు శిక్షణకు ఎంపిక చేసిన మహిళల జాబితాను ఏపీఎం డీసీ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపించాము. ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా ఎన్నికల కమిషన్ నిలు పుదల చేసిందని తదుపరి శిక్షణ ఉత్తర్వు లు ఇంకా రాలేదని, ఏపీఎండీసీ ఆదేశాలు రాగానే వెంటనే శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీ చేపడతామన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఈబీ దాడులు

రెండు రోజుల్లో ఆరు ట్రాక్టర్లు పట్టివేత - జరిమానా విధింపు


ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఈబీ సీఐ మహేష్ కుమార్ సిబ్బంది

ప్రొద్దుటూరు, జూలై 21: పట్టణంలో నిరాటంకంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఈబీ అధికారులు రెండు రోజులుగా దాడులు నిర్వహించారు. లింగాపురం, సీతంపల్లె సహా పలు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 6 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్లకు రూ.54 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాలతో 12 మందితో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని, ఎప్పుడైనా ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే దాడులు చేసి పట్టుకుంటారన్నారు. ప్రొద్దుటూరు ఎస్ఈబీ పరిధిలో ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు మండలాలు వున్నాయని కానీ ఎస్ఐ, సీఐ సహా ఐదుగురు కానిస్టేబుల్స్ వుంటారన్నారు. సిబ్బంది కొరత వల్ల పూర్తి స్థాయిలో ఇసుక అక్రమ రవాణా నియంత్రించలేకపోతున్నామన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యతను ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21: చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ మురళీధర్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవాంగ కల్యాణ మండపంలో నిర్వహిం జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచినవారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి పతకాలు సాధించాలన్నారు.

ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 180 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్, కేడెట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి నాయబ్‌రసూల్, ఆర్గనైజర్ సలీం, బాష, రమేష్, తైక్వాండో అసోసియేషన్ నెల్లూరుజిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అనంతపురం జిల్లా కార్యదర్శి సాయిబాబా, కర్నూలుజిల్లా కార్యదర్శి అబ్దుల్, కోచ్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ వేడుకలు



వీరబల్లిలో పూజలందుకున్న సాయిబాబా



చిట్వేలిలో..



నందలూరులో..



ఒంటిమిట్టలో...

గురుపౌర్ణమి సందర్భంగా మూడు నియోజకవర్గాల్లోని సాయిబాబా ఆలయాలు, పలు ప్రముఖ ఆలయాల్లో పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కొన్ని ఆలయాల్లో అన్నదానం చేశారు రైల్వేకోడూరు జూలై 20: అందరూ వ్యాస మహర్షి అడుగుజాడల్లో నడవాలని విశ్వహిందూపరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సమాజంలో ఆదివారం వ్యాస జయంతి నిర్వహించారు. మహిళా విభాగం నాయకురాలు సుజాత ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో సాయిబాబా కు ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణంలోని ప్రముఖులు హాజరయ్యారు. కె.బుడుగుంటపల్లె, పగడాలపల్లెల్లోని షిర్డి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్దవటం : మండలంలో షిర్డీసాయిబాబా మందిరంలో సాయినాథుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బాకరాపేట బెటాలియన్ సమీపంలోని సాయిబాబా మందిరంలో భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఉప్పరపల్లెలో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున కాయా కర్పూరం సమర్పించారు.

పుల్లంపేట: స్థానిక చిట్వేలి రోడ్డులో ఉన్న బొంబాయస్వామి ఆశ్రమంలో పూజలు, అభిషేకాలు నిర్వహించి అన్నదానం చేశారు. కోనెయ్య గారిపల్లె ఆశ్రమంలో పూజలు నిర్వహించి అన్నసంతర్పణ చేశారు.

రాజంపేట టౌన్: పట్టణ, మండల పరిధిలోని పలు ఆలయాలు గురుపూజోత్సవం సందర్భంగా కిటకిటలాడాయి. సాయినగర్, రాంనగర్, మండల పరిధిలోని కూచివారిపల్లె సాయిబాబా మందిరాలను ప్రత్యేకంగా అలంకరించారు. కూచివారిపల్లెలోని సాయి మందిరంలో టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మన్నూరులో గోదా మహాలక్ష్మీ సమేత ఐరావత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ గురుపౌర్ణమి ప్రాధాన్యతను వివరిస్తూ తల్లీ తండ్రీ తర్వాత గురువుకు అధిక ప్రాధాన్యమిచ్చే భారతీయ హైందవ సంస్కృతి సంప్రదాయాలు నేటి యువతకు అనుసరణీయాలని తెలిపారు. ఆయన సతీమణి హైమావతితో కలసి తమ పిల్లలు జగతి, జాగృతి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఒంటిమిట్ట: స్థానిక సాయిబాబా గుడిలో ఉదయం నుంచి స్వామివారికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. కొండమాచుపల్లె గ్రామంలోని ఆలయంలో సాయిబాబాకు అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చిట్వేలి: చిట్వేలి, ఖైలపల్లె, వడ్డిపల్లె, నగిరిపాడు, కెఎస్ అగ్రహారం తదితర ఆలయాల్లో వేకువజామునుండే పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. సామూహిక పారాయణం చేసి గురువు గొప్పతనాన్ని చాటారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నందలూరు: మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి కన్యక చెరువు కట్టపై వెలసిన సాయిబాబా ఆలయంలో స్వామివారి మండపాన్ని పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పెనగలూరు: పెనగలూరు, పొందలూరు, సిద్దవరం సాయిబాబా ఆలయాల్లో తెల్లవారుజాము నుండి భక్తులు బాబాను దర్శించుకుని పాలాభిషేకం, కాగడ హారతి, గ్రామోత్సవాల్లో పాల్గొన్నారు. పెనగలూరు దేవాలయంలో ధర్మకర్త పసుపులేటి రాజేంద్రప్రసాద్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం నుంచి మహిళా భక్తులు దీపాలు వెలిగించారు.

రాయచోటి టౌన్: పాతరాయచోటిలోని దాక్షాయణి సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో మహాగణపతి హోమం, పార్వతీ పరమేశ్వరుల పల్లకి ఉత్సవం నిర్వహించి, అన్నదానం చేశారు. ఎస్ఎన్‌కాలనీలోని మందిరంలో అన్నదానం చేశారు. భద్రకాళీ సమేత వీరభద్రాలయం, భైరవగుట్టపై ఉన్న కాలభైరవస్వామి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

వీరబల్లి: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో హోమం, పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. అన్నదానం చేశారు.హించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోదండరామాలయ గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఒంటిమిట్ట, జూలై 21 : ఆంధ్ర అయోధ్యగా పేరు గాంచిన ఒంటిమిట్టలో గురు పౌర్ణమి సందర్భంగా కోదండ రామస్వామి భక్తులు 14 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేశారు. సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలోబీజేపీ నాయకుడు పాటూరు గంగిరెడ్డితో కలిసి ఉదయం ఆరు గంటలకు కోదండ రామాలయం నుంచి పెద్ద కొత్తపల్లె, గంగపేరూరు, పెన్నపేరూరు, ఇబ్రహీంపేట, రాచగూడపల్లె, రాచపల్లి, సాలాబాద్, మలకాటిపల్లె మీదుగా గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ కోదండ రాముని ప్రాబల్యం మండల ప్రజలకు, జిల్లా ప్రజలకు తెలియాలని ప్రతి పౌర్ణమికి 14 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ చేస్తారన్నారు. తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి స్వామివారి ఆశీస్సులతో తాను ముందుకు వెళుతున్నానని, అదే సంకల్పంతో స్వామివారికి సేవ చేయాలని వినూత్న కార్యక్రమాన్ని చేపట్టానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటూరు గంగిరెడ్డి, బాలరాజు, శివరాజు, ప్రతాప్‌రెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, బలరాం, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడితో రైతులు విలవిల



పందుల దాడిలో ధ్వంసమైన కర్బూజ పంట

ఓబులవారిపల్లె, జూలై 21 : అడవి పందుల దాడితో బాలిరెడ్డిపల్లె రైతులు లబోదిబో మంటున్నారు. గ్రామ పంచాయతీ పరిధి లోని ఇందిరానగర్‌కు చెందిన రైతులు పార్వతమ్మ, దమ్ము చిన్నయ్య ఐదెకరాలు, దమ్ము వెంకట రమణ 5 ఎకరాల కర్బూజ సాగు చేశారు. శనివారం తెల్లవారుజామున పందుల గుంపు పొలంపై పడి పంటను ధ్వంసం చేశాయి. కొద్దిరోజుల్లో చేతికి వస్తుందని ఆశలు పెట్టుకున్న వారి పంటను పూర్తిగా నాశనం చేయడంతో రైతులు విలపిస్తున్నారు. అడవిపందుల దాడి నుంచి పంటకు రక్షణ కల్పించాలని, అప్పులు చేసి సాగు చేసి నష్టాలపాలైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి



జనసైనికులనుద్దేశించి మాట్లాడుతున్న జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు

రాజంపేట టౌన్, జూలై 21 : జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేస్తోందన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు భరోసా కల్పించి. వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు.

ఒంటిమిట్ట : మండలంలోని నరసన్నగారిపల్లెలో రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నేత అతికారి కృష్ణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పవన్‌కళ్యాణ్ నాయకత్వాన్ని రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాలని అందుకోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పుత్త రామచంద్రయ్య, కొత్తపల్లి వెంకటయ్య, గంజి సుబ్బరాయుడు, చలపతి చంద్ర, గజ్జల నరసింహారెడ్డి, రాటాల రామయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఘనంగా పూజలు

లక్కిరెడ్డిపల్లె జూలై 21: మండలలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు అతిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.భక్తులతో గంగమ్మజాతర కిక్కిరిసంది ఆషాడ మాసంలో అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పిస్తారు ఈఆషాడ మాసంలో చాల మంది అమ్మవారికి మొక్కుబడు చెల్లిస్తారు.

నాగారపమ్మకు పూజలు, బోనాలు

సుండుపల్లె, జూలై21: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టువస్త్రాలను సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు.

పద్మశాలి సంఘ అధ్యక్షుడుగా దొంతు శివయ్య

పుల్లంపేట, జూలై 21 : రైల్వేకోడూరు నియోజకవర్గ పద్మశాలీ సంఘం అధ్యక్షుడుగా పుల్లంపేట మండలం సీతారాంపేటకు చెందిన దొంతు శివయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎస్‌బీవీడీ ఉన్నత పాఠశాలలో పద్మశాలి సంఘ కుల సమావేశాన్ని నిర్వహించారు. గౌరవాధ్యక్షుడుగా ఎస్‌బీవీడీ విద్యాసంస్థల ఛైర్మన్ నూకల శ్రీరాములు వ్యవహరించారు. ఈ సందర్భంగా దొంతు శివయ్య మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌బీవీడీ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.చలమయ్య, పద్మశాలి సంఘ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు సోము బాలాజీబాబు, అవ్వారు శ్రీనివాసులు, బుదారపు నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సతో ఆత్మరక్షణ

రాజంపేట, జూలై 21 : మార్షల్ ఆర్ట్స్ సాధనతో తమను తాము రక్షించుకోగలరని ఊటుకూరు ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ అన్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారుడు చౌడవరం చరణ్‌కుమార్, కె.గంగరాములు బ్లాక్ బెల్టు సాధించిన సందర్భంగా ఆదివారం జీఎంసీ క్లబ్ ప్రాంగణంలో క్రీడాకారులను ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. కేక్ కట్‌చేసి క్రీడాకారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందన్నారు. క్రీడా కోటా ద్వారా విద్య, ఉద్యోగాల్లో సైతం రాణించవచ్చునని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. అకాడమి గ్రాండ్‌మాస్టర్ సునీల్‌ను అభినందించారు. అకాడమి ఉపాధ్యక్షుడు బచ్చేటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహా, ప్రముఖ ఆంగ్లభాష బోధకులు యానాది, కోచ్ కె.నాగరాజ, కె.గంగారాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్

రాయచోటిటౌన్, జూలై 21: దేశంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, జీ. ఈశ్వరయ్య ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్ అధ్యక్షతన సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలు ఎండగట్టారన్నారు దేశంలో ప్రజా స్వేచ్ఛను హరిస్తున్నారని, ప్రశ్నించే గొంతుకలను అకారణంగా జైళ్లకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్వేతపత్రాల విడుదల పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గాలేరు-నగిరి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులు పునర్నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో వామపక్షాలకు బలం తక్కువ ఉన్నా అనునిత్యం ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, మనోహర్‌రెడ్డి, సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, విశ్వనాథ్‌నాయక్, సుధీర్‌కుమార్, మురళి, సుమిత్రమ్మ, జ్యోతి, చిన్నయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణపై కార్యాచరణ విజయవంతం చేయాలి



ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్, జూలై 21: ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందించే కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం జీవో 117 రద్దు చేసి 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లా, రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులకు విజ్ఞాపన పత్రాలు, ఆగస్టు 5 నుంచి 15 వరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ వినతిపత్రాలు ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి 30 వరకు 3 వేల సంతకాలతో మంత్రులకు వినతిపత్రాలు అందించాలని కోరారు. సెప్టెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్టుకార్డులు పంపించాలని పిలుపు నిచ్చారు. సంఘం నిర్ణయాలను అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు అక్రమ బాషా, భాస్కర్‌రెడ్డి, పురం వెంకట్రమణ, శ్రీధర్‌రెడ్డి, రమణమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు



మీడియా సమావేశంలో మట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జూలై 21: భవిష్యత్తు తరాలపై విజన్ ఉన్న ఏకైక నాయకుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు గడవక ముందే వైసీపీ అధినేత జగన్‌రెడ్డితో పాటు వైసీపీ నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పనిగట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు టీడీపీ నేతలపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత 15 సంవత్సరాలుగా రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎటువంటి అభివృద్ధి చేయని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక మతిభ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో రాయచోటి చుట్టుప్రక్కల ప్రభుత్వ భూములు లేకుండా చేయడమే కాకుండా, భూకబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. శ్రీకాంత్‌రెడ్డి కూడా 15 ఎకరాల కుపైగా అక్రమంగా పొందారని ఆరోపించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, సంబేపల్లె మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

అంకాలమ్మ సన్నిధిలో కస్తూరి

పెనగలూరు, జూలై 21 : మండలంలోని కట్టావారిపల్లెలో ఆదివారం గ్రామ దేవత అంకాలమ్మ జాతర నిర్వహించారు. గ్రామోత్సవంలో పోతులరాజు, అమ్మవారి ఉత్సవ విగ్రహాల ముందు పొట్టేళ్లు, మేకపోతులు, కోడిపుంజులను బలిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ్ నాయుడు, మాజీ సర్పంచ్ కె.నాగేశ్వర్‌నాయుడు, ఆనందనాయుడు, రామాంజులునాయుడు, సుబ్బరామయ్యనాయుడు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆపన్నహస్తం

ఒంటిమిట్ట, జూలై 21 : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లికి చెందిన కట్ట వెంకటరమణ(41) రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో 1997-98 బ్యాచ్ విద్యార్థులు స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన కుటుంబానికి రూ.15 వేలు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బరామయ్య, రవీంద్రనాథ్‌రెడ్డి, రాజేంద్ర, హరింద్రనాథ్‌రెడ్డి, సురేష్, రాంబాబు, శైలజ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం..



సోములవాండ్లపల్లె స్థానికులతో మాట్లాడుతున్న మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూలై 21: మంత్రి మండిపల్లె రాంప్రసాదు రెడ్డి చొరవతో లక్కిరెడ్డి పల్లెను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి మండిపల్లె రాంప్రసాదురెడ్డి సోదరుడు మండిపల్లె లక్ష్మీ ప్రసాదురెడ్డి తెలిపారు. ఆదివారం సోములవాండ్లపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాయచోటి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని కోరగా, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో గ్రామీణ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాలల్లో తాగునీరు, రోడ్లు, పక్కాగృహాలు సమస్యలు త్వరగా పరిష్కరిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మదన్ మోహన్ , జానకీడు నాగసాయి, కావలి ఆంజనేయులు, కటవమీద ఆంజనేయులు, రమణ, వెంకటరమణ, ఎం యర్రంరెడ్డి, రంగడు, సోమశేఖర్, ఆంజనేయులు, వివేకానందరెడ్డి, శివారెడ్డి, వెంకటకృష్ణ, గణేష్, రెడ్డెయ్య, గంట సుదర్శన్ , ఉమాపతి, జానరీడు రెడ్డెయ్య, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాజంపేట, జూలై 21 : మండల పరిధిలోని పోలి గ్రామంలో శుక్రవారం రాత్రి ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ సుబ్బయ్య (26) అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. సుబ్బయ్య కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న టీడీపీ నాయకులు ఊటుకూరు కర్ణాటకం చెంగల్ రాయుడు దహన సంస్కారాల కోసం సుబ్బయ్య భార్య సావిత్రికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో సుబ్బయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి పెంచలయ్య, జీవీ రమణరాజు, బొబ్బిలి ఓబిలి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, జూలై 21: చెన్నముక్కపల్లెలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 50 మందికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 24 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 36 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి 'ఫైట్ ఫర్ యువర్ రైట్స్' సాయం

చిట్వేలి, జూలై 21 : కిడ్నీ వ్యాధితో బాధడుతూ తిరుపతిలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిట్వేలి మండలం తిమ్మాయపాళెం గ్రామ పంచాయతి గట్టుమీద పల్లెకు చెందిన అద్దంకి సురేష్ వైద్య ఖర్చుల కోసం నేతివారిపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ యెద్దల చెంగల్‌రాయులు అందజేసిన 10 వేలను ఫైట్ ఫర్ యువర్ రైట్స్ సంస్థ సభ్యులు ఆదివారం గట్టుమీదపల్లెలోని బాధితుడి ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి మస్తాన్‌రాయల్, పిడుగు సుబ్బరాయుడు, మాదాసు శివ, సువ్వారపు నాగేష్, షేక్ రియాజ్, శివ, చిన్నయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, జూలై 21 : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పీడీ నీలకంఠరావు తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులో జరిగిన జూనియర్, సీనియర్ ఇన్విటేషన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఇంటర్ సెకండియర్‌కు ఎంపీసీ విద్యార్థిని భార్గవి, విద్యార్థి రోహిత్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. ఆగస్టులో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. భార్గవి, రోహిత్, పీడీ నీలకంఠరావును ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, ఉపాధ్యాయులు అభినందించారు.

హనుమంత, సింహ వాహనాలపై సిద్ధేశ్వరుడు, చెన్నకేశవుడు



సింహ వాహనంపై సిద్ధేశ్వరస్వామి

రాజంపేట, జూలై 21 : తాళ్లపాకలోని సిద్ధేశ్వర, చెన్నకేశవాలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహ వాహనంపై సిద్ధేశ్వరస్వామి, హనుమంత వాహనంపై చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సిద్ధేశ్వరస్వామికి, చెన్నకేశవస్వామికి వేర్వేరుగా పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద గల ప్రధాన వేదికపై వేదపండితుడు కృష్ణమూర్తి, అర్చకుడు నరేష్ తదితరులు ఊంజల్ సేవ నిర్వహించారు. నంద్యాల నుంచి వచ్చిన మల్లేశ్వరి బృందం, అన్నమయ్య జిల్లాకు చెందిన ఎల్లయ్య, రమణమ్మ బృందాలు కోలాట ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక దేవాలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి బాబు, ఆర్.స్వామినాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, మహిళా భక్తులుపాల్గొన్నారు.

ఎర్రచందనం పార్కును సుందరంగా తీర్చిదిద్దుతాం



పార్కును వీక్షిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), జూలై, 21: పట్టణంలోని ఎర్రచందనం పార్కు రూపు రేఖలు మారుస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కూటమి నాయకులతో కలిసి ఎర్రచందనం పార్కను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఈ పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధి మరుగున పడిందన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా గుడిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, గుండయ్య నాయుడు, నరసింహ రెడ్డి, పీసీఎన్ బ్రదర్స్, జోగినేని మనీ, ఎన్ఎస్ఆర్, ఆలయ చైర్మన్ కామిశెట్టి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.



కన్నులపండువగా శ్రీవారి గరుడవాహనసేవ



తిరుమల క్షేత్రంలో ఆదివారం గరుడసేవ కన్నుల పండువగా జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. ఆదివారం సెలవుదినం, గురుపౌర్ణమి కూడా కావడంతో భక్తులు భారీగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. గ్యాలరీల్లోని భక్తులు కర్పూర హారతులిస్తూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బోయకొండలో భక్తుల రద్దీ

చౌడేపల్లె, జూలై 21: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లును ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. కాగా, అమ్మవారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఆశీర్వాద మండపం వద్ద కలశ స్థాపన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు.





బోయకొండ గంగమ్మ దర్శనానికి క్యూలైన్లలో వేచియున్న భక్తులు



ప్రొఫెసర్లతోపాటు జాతీయ గీతం పాడుతున్న గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్, కేవెన్ సత్యనారాయణ

సామాజిక బాధ్యత

అలవర్చుకోండి

- ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్
- ఘనంగా ఐఐటీ ఆరో స్నాతకోత్సవం
- 338మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

ఏర్పేడు, జూలై 21: ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని ఇన్ఫోసిస్, యాక్సిలర్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరో స్నాతకోత్సవాన్ని అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఆరు గంటలకు ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు కోపైలెట్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే కాకుండా సహ ఇంటెలిజెన్స్ భాగస్వామి అని చెప్పారు. సాంకేతికత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. తిరుపతి ఐఐటీలో చదువుకోవడం అదృష్టవంతులుగా భావిస్తున్నానన్నారు. మీరు చేసే అన్ని ప్రయత్నాల్లో శ్రేష్ఠత కోసం కృషి చేయాలని అన్నారు.





అనూష్ మంగళ్‌కు ప్రెసిడెంట్ అవార్డు, ఎంఎస్ స్నేహకు గవర్నర్స్ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులతో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

2047నాటికి వీక్షిత్ భారత్‌గా మార్చాలి: సజ్జన్ జిందాల్

మనదేశాన్ని 2047నాటికి వీక్షిత్‌భారత్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నం చేస్తోందని బోర్డు ఆఫ్ గవర్నర్స్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ అన్నారు. స్నాతకోత్సవానికి సహ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వీక్షిత్‌భారత్ కోసం చాలా సమగ్రమైన విధానం అవసరమని చెప్పారు. అంతేకాకుండా పౌరులందరి పట్టుదల, అంకితభావంతో మాత్రమే అది సాధ్యమవుతుందన్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం 1,500 మంది చదువుతున్నారన్నారు. వీరందరికీ అవసరమైన వసతులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతనూ భట్టాచార్య, ఐఐటీ పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్ కుమార్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అవార్డులు, డిగ్రీలిలా..

క్రిస్ గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్ చేతుల మీదుగా అవార్డులను విద్యార్థులు అందుకున్నారు. ప్రెసిడెంట్ అవార్డును అనూష్ మంగళ్, గవర్నర్స్ అవార్డును ఎంఎస్ స్నేహ, ప్రొఫెసర్ కంటమ్ కృష్ణయ్య అవార్డును అరిమంత భవన్‌రెడ్డి, రామకృష్ణ లక్ష్మీకాంత మెమోరియల్ ప్రైజ్‌ను ప్రశాంత్‌సింగ్, అమరరాజా గ్రూప్ అవార్డును డేవిడ్సన్ పొల్ల, ఇన్‌స్టిట్యూట్ అవార్డులను జనపతి వెన్నెలదేవి, ఇందుకూరి నాగమహిత అందుకున్నారు. అలాగే 210మంది బీటెక్ డిగ్రీలు, 76మందికి ఎంటెక్, 28మందికి ఎమ్మెస్సీ, 16మందికి ఎంపీపీ, ముగ్గురికి ఎంఎస్ పరిశోధన, ఐదుగురికి పీహెచ్‌డీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒకరికి డిప్లొమా డిగ్రీలు ప్రదానం చేశారు. మొత్తంగా 338మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవం ప్రారంభానికి ముందు అమరరాజా గ్రూప్ ఛైర్మన్, అండ్ డైరెక్టర్ మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఐఐటీని సందర్శించారు. అనంతరం ఐఐటీ అధికారులతో సమావేశమై అమరరాజా గ్రూప్ సంస్థ బ్యాటరీ తయారీ రంగంలో ఎలా ముందుకు పోతుందో అనే విషయాలను వివరించారు. స్నాతకోత్సవానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, నిపుణులు హాజరయ్యారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది.



రామకృష్ణ లక్ష్మీకాంత్ మెమోరియల్ ప్రైస్ అందుకుంటున్న ప్రశాంత్‌సింగ్



అమరరాజ ప్రైస్ అందుకుంటున్న డేవిడ్‌సన్ పొల్ల





ఇన్‌స్టిట్యూట్ ప్రైస్ అందుకుంటున్న ఇందుకూరి నాగమహిత, జనపతి విన్నెలదేవి

పూర్వజన్మ సుకృతం

ప్రెసిడెంట్ అవార్డు అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. ఇంత మందిలో నాకు అవార్డు రావడం గర్వంగా ఉంది.

- అనూష్ మంగళ్, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత

ఆనందంగా ఉంది

నాకు గవర్నర్స్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. ప్రతి ఒక్కరూ బాగా చదుకోవాలని కోరుతున్నా.

- ఎంఎస్ స్నేహ, గవర్నర్స్ అవార్డు గ్రహీత

నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూలై 21: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ తప్పక హాజరుకావాలని తెలిపారు. చిత్తూరు పాత డీపీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 21: జాతీయ విద్యావిధానం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి వారం రోజులు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఈవో దేవరాజు, ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. జాతీయ విద్యావిధానం అమలుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోమవారం స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించడం, 23న అభ్యసనా పునాది, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాలు అభివృద్ధి చేయడం, 24న క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, 27న పర్యావరణ పరిరక్షణ, 28న సామాజిక భాగస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

టీడీపీలోకి పులిచెర్ల ఎంపీటీసీలు, సర్పంచులు



చల్లాబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీలు, సర్పంచులు

రొంపిచెర్ల, జూలై 21: పులిచెర్ల జడ్పీటీసీ మురళి ఆధ్వర్యంలో ఆ మండలానికి చెందిన నలుగురు వైసీపీ ఎంపీటీసీలు, 8మంది సర్పంచులు ఆదివారం టీడీపీలో చేరారు. రొంపిచెర్లలోని పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి వచ్చిన వీరు.. ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కల్లూరు, కల్లూరు 1, పులిచెర్ల, మంగళంపేట ఎంపీటీసీలు రెడ్డి బాబుల్లా, మంజుల, ఈశ్వరి, రాశి, కల్లూరు, పాళెం, దేవళంపేట, పులిచెర్ల, 106రామిరెడ్డిగారిపల్లె, రేణుమాకులపల్లె, మంగళంపేట, చల్లావారిపల్లె సర్పంచులు ఎస్.ఎ. షుకూర్, సరస్వతి, ఉషారాణి, రాణెమ్మ, అనిత, వెంకటేష్, మధు, అమ్ములుకు చల్లాబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు పాలనలో మంచి జరుగుతుందని, ఆయన ఆశయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లతామన్నారు.

వేణుగోపాలస్వామి గుడి, గోపురం మధ్యలో దారి

- ఒక వర్గం ప్రతిపాదన
- ఇలా వేరు చేయడం సరికాదన్న మరో వర్గం

చౌడేపల్లె, జూలై 21: చౌడేపల్లెలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి, గోపురానికి సంబంధం లేకుండా మధ్యలో దారి ఏర్పాటు చేయాలని ఒక వర్గం ప్రతిపాదించగా.. వద్దంటూ స్థానికుల వర్గం పేర్కొంది. ఈ పంచాయితీ గోపురం నిర్మాణకర్త ఎస్కే వెంకట రమణారెడ్డి వద్దకు ఆదివారం చేరింది. ఆలయ ఆవరణలోని కొన్ని కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకుడు తానా నాగరాజు మాట్లాడుతూ.. తరతరాలుగా ఆలయం సమీపంలో ఉన్న తమకు దారి ఇవ్వాలని, దారికోసం ఆలయ ప్రహరీకి, రాజగోపురం మధ్యలో సుమారు 20 అడుగుల దారిని అప్పటి వైసీపీ నాయకులు, కొందరు గ్రామస్తుల సూచనతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయాన్ని, గోపురాన్ని విడదీసినట్లు చేయటం ఆగమశాస్త్ర విరుద్ధమని మరొక స్థానికుల వర్గం వాదించింది. ఆలయంతోపాటు రాజగోపురం ప్రహరిని కలిపి కట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి ఆలయ ఆవరణలో స్థానికులతో మాట్లాడుతూ.. త్వరలో శారద మఠం పీఠాధిపతులతో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రాజగోపురం కలశ ప్రతిష్ఠ, సుదర్శన హోమాలు చేయనున్నట్లు తెలిపారు. కాబట్టి గ్రామస్తులు, ఆలయ సమీపంలో నివాసమున్న వారు కలసి ఆమోదయోగ్యమైన ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులు మాత్రం ఆలయ ఆవరణలో కుటుంబాలు ఉంటే అంటు, మైలి వంటివి జరుగుతాయని, అలాగైతే అరిష్టమని పేర్కొన్నారు. నివాసాలకు, ఆలయానికి సంబంధం లేకుండా ఆలయాన్ని, రాజగోపురాన్ని కలిపి పనులు చేయించాలని కోరారు. కాగా, అక్కడి కుటుంబీకులకు ఆలయం వెనుక వైపు నుంచి ప్రత్యామ్నాయ దారి చూపించాలని కొందరు సూచిస్తున్నారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్కే రమణారెడ్డి

తహసీల్దార్లకు నేడు రిలీవింగ్ ఆర్డర్లు!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 21: ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు సొంత ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి చిత్తూరుకు వచ్చిన తహసీల్దార్లు తమ ప్రాంతాలకు వెళ్ళేందుకు సిద్ధమౌతున్నారు. ఫిబ్రవరి 1న జిల్లా నుంచి కడప, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాలకు 31 మంది వెళ్ళగా, ఆ జిల్లాల్లోనుంచి 31 మందిని జిల్లాకు అలాట్ చేశారు. వారిలో ఇద్దరు మినహా 29 మంది మాత్రమే చిత్తూరు జిల్లాకు వచ్చారు. సీఎం చంద్రబాబు తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రెండ్రోజుల క్రితం రెవిన్యూ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 29 మంది తహసీల్దార్లను సోమవారం రిలీవ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఫైలును కలెక్టరేట్‌లోని రెవిన్యూ విభాగం సిద్ధం చేసి, సోమవారం కలెక్టర్‌కు అందించనుంది. రిలీవింగ్ ఆర్డర్లు అందుకున్న తర్వాత పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారు ఒక్కొక్కరుగా రిలీవ్ కానున్నారు. ఆ తర్వాత వారంతా మంగళ, బుధవారాల్లో తమ జిల్లాల కలెక్టరేట్లలో రిపోర్టు చేసుకోవాల్సిఉంటుంది. ఇతర జిల్లాలకు చిత్తూరు జిల్లా నుంచి వెళ్ళిన తహసీల్దార్లకు జిల్లాకు వచ్చాక వారికి కలెక్టర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. జిల్లాకు వచ్చే తహసీల్దార్లకు వారి సొంత డివిజన్‌లో పోస్టింగ్స్ ఇవ్వవద్దని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్లు జిల్లాకు వచ్చినా గతంలో వారు పనిచేసిన మండలాలను కేటాయిస్తారా? లేక వేరే మండలాలకు పంపుతారా? అనే అంశంపై స్పష్టత రాలేదు.

ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటూ..

జిల్లాలో చిత్తూరు అర్బన్‌తో కలిపి 32 మండలాలు.. చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి ఆర్డీవో కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ ఏవోలుగా, సెక్షన్ సూపరింటెండెంట్లుగా ఐదుగురిని నియమించాల్సి ఉంటుంది. ఇంకా 32 మంది తహసీల్దార్లను సర్దుబాటు చేయాలి. కాగా, చిత్తూరు, నగరి, పూతలపట్టు,త గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు తొలిసారిగా ఎన్నికైన శాసనసభ్యులు ఉన్నారు. వైసీపీ హయాంలో ఆయా తహసీల్దార్ల పనితీరును బేరీజు వేసుకుంటూ సమర్థంగా పనిచేసే అధికారుల కోసం కూటమి ఎమ్మెల్యేలు దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో ఎవరెవరికి ఏ మండలంలో పోస్టింగ్స్ వస్తాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కొంత మంది తహసీల్దార్లు శాసనసభ్యుల వద్దకు, కూటమిలోని సీనియర్ నాయకుల వద్దకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు. సిఫార్సులేఖలు ఇప్పటికిప్పుడే ఇవ్వలేమని, ప్రభుత్వ ఆలోచన మేరకు నడచుకుంటామని శాసనభ్యులు చెబుతున్నట్లు సమాచారం.

కీలక మండలాలకు పోటీ

జిల్లాలోని కీలక మండలాలైన చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి, పలమనేరు, కుప్పం, భూములు వివాదాలు ఎక్కువగా వున్న గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, గుడుపల్లె, విజయపురం.. క్వారీలు ఎక్కువగా వున్న రెండు రాష్ట్రాల సరిహద్దులోని కుప్పం నియోజకవర్గంలోని మండలాల్లో పోస్టింగ్స్ కావాలని కొంతమంది తహసీల్దార్లు, ఎమ్మెల్యేలు, రెవిన్యూ అసోసియేషన్‌లో కీలక నాయకుల నుంచీ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు ● ప్రత్యేక పూజలు, అలంకరణలు, అన్నదానాలు



సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



మదనపల్లె శ్రీకృష్ణాలయంలో విశేషాలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు



నిమ్మనపల్లెలో ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

మదనపల్లె అర్బన్, జూలై21: గురుపౌర్ణమి వేడుకలను పట్టణంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బర్మావీధిలోని షిర్డీసాయిబాబా ఆలయంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్ల బాబు నాయుడు దంపతులు హోమం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే బైపాస్‌రోడ్డులోని దక్షిణాషిర్డిసాయిబాబాకు గురుపౌర్ణమి సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. వరాల ఆంజేయస్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు తోపాటు విశేషపూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మచెరువు మిట్ట గంగమ్మ గుడి సమీపంలోని సాయిబాబా ఆలయం లో ఆలయకమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అనప గుట్టలోని శ్రీకృష్ణాఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గిరిప్రదక్షిణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈశ్వరమ్మ కాలనీ పెంచుపాడు రోడ్డులో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వాల్మీకి సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. గురుపౌర్ణమి సందర్భంగా బాలు, పూలకుంట్ల హరిబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాగార్జునబాబు, షంషీర్, నాగూర్‌వలి, విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు, మేకల విజయమోహన్, ముత్తరాశి హరికృష్ణ, వేమయ్య, మేస్రీ రామకృష్ణ, తులసీ రామకృష్ణ, సహదేవనా యుడు పాల్గొన్నారు.



రామసముద్రం సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నిమ్మనపల్లిలో: మండలంలోని స్థానిక దిగువవీధిలో వెలసిన సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ ఉదయం స్వామి వారికి బాజభజంత్రీల మధ్య ప్రత్యేక హోమాలు చేపట్టి ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిమ్మనపల్లి పురవీధులలో పిల్లనగ్రోవి, చెక్కభజనలు, భళ్లారిడ్రమ్స్, ప్రత్యేక గోమాతతో రథంపై స్వామి వారిని ఊరేగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని శేషసాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు. మదనపల్లె చంద్రమౌళీశ్వర స్వామి, పరమే శ్వరప్ప ఆదివారం తెల్లవారుజామునే గణపతి, దత్తాత్రేయ స్వామికి, బాబా వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు. ఆలయం వద్ద నిర్వాహకులు పి.సుధాకర్, వెంకటేష్‌లు దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమిని పురష్కరించుకుని తెల్లవారు జాము నుంచి పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా గ్రామస్థులందరు కలిసి సత్యనారాయణ పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రామసముద్రంలో: సమర్ధ సద్గురు సాయినాథాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణ, అలంకరణ, పూజలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు లక్ష్మీపతి, రామచంద్ర, ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో స్వామివారి పుష్ప పల్లకిని పలురకాల పూలతో అలంకరణ చేసి సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని అందులో ఉంచి ఊరేగించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

కలకడలో: మండలంలోని ప్రజలు ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. బాటవారిపల్లెలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకం, ఆకుపూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్ని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పీలేరులో: పీలేరు సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణిమను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునే సాయిబాబాను ఆలయ పూజారులు ప్రత్యేక పుష్పాలతో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున్న సాయి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు తాకిడి ఎక్కువగా ఉండడంతో పీలేరు పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి సమీపంలోని సాయిబాబా ఆలయం, పెద్దమండ్యం కలిచెర్ల, వెలిగల్లు గ్రామాలలో గురుపౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అర్చకులు మణికంఠస్వామి గ్రామ పెద్దలు విశ్వనాధరెడ్డి, ప్రభాకరరెడ్డి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బికొత్తకోట పట్టణంలో ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబా విగ్రహానికి విశేష అలంకరణ, పుష్పాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో షిర్డి సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 21: డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరు కలసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడకంతో చాలా మంది యువత పెడదోవపడుతున్నారని, నేరాలు చేస్తూ జైలుకు వెళుతున్నారన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏఆర్ సురేష్, టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, మున్సిపల్ కౌన్సిలర్ తులసి, రామకృష్ణాచారి, ఐటీయూసీ గొంగడి కృష్ణమూర్తి, వార్డెన్ వెంకటేశ్ హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి, నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్లు ఎంపిక



రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూలై 21: అన్నమయ్య జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు అధ్యక్షురాలు శిరీషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఈ ఎంపికలో జిల్లా నుంచి పెద్దసంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో ప్రతిభ చూపిన వారిలో అండర్-10, అండర్-12, అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలుగా క్రీడాకారులను మొత్తం 50 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి బి.శరత్ మాట్లాడుతూ జిల్లాకు ఎంపికైన జట్లు కర్నూల్‌లో ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకమ్మ, అన్సర్‌బాషా, సుధాకర్, జలజ, కరుణాకర్, లత, భారతి, జగదీష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత కంటివైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మదనపల్లె టౌన్, జూలై 21:స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, అరబిందో కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో జ్ఞానాంబిక విద్యా సంస్థలు ముందు నిలవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి 200 మంది ప్రజలు హాజరుకాగా వారికి విషన్ టెస్ట్, కాటరాక్ట్ ఎవాల్యూషన్, డయాబెటిక్ రెటినోపతి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అందులో 25 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్సలకు వైద్యులు ఎంపిక చేశారన్నారు. 25 మందికి తిరుపతిలోని అరబిందో కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించి తిరిగి మదనపల్లెలో వారి నివాసాలకు చేరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రచన, క్యాంపు కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి వృద్ధురాలు ఆత్మహత్య



మృతురాలు షహనాజ్

కురబలకోట, జూలై 18: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన సయ్యద్‌ఖాన్ భార్య షహనాజ్(62) గత కొనేళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులలో చూపించినా రోగం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దాచిన విషం తాగింది. గమనించిన కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రైతు ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జూలై 21: రియల్టర్ మోసం చేశాడని ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గూడుపల్లె పంచాయతీ కనుగొండవారిపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి(60) ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన దగ్గర పొరుగు గ్రామానికి చెందిన ఓ రియల్టర్ 2020లో కొంత భూమిని అగ్రిమెంట్ చేసుకుని నగదు ఇవ్వకుండా ఇచ్చినట్లు చెప్తున్నాడని, దీంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తట్టివారిపల్లెలో మహిళ మెడలో చైన్ చోరీ

కురబలకోట, జూలై 21: మండలంలోని నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ తట్టివారిపల్లెలో మహిళ మెడలో చైన్ చోరీకి గురైన సంఘటన ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి మహిళ రేణుకా చిల్లరదుకాణాన్ని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నది. కాగా సాయంత్రం అంగళ్ళు నుంచి ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో వచ్చి దుకాణంలో ఉన్న మహిళ మెడలో సుమారు 30గ్రాముల బంగారు చైన్‌ను లాక్కుని ద్విచక్రవాహనంలో పరారయ్యారు. విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్మీకి సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా బుర్రా రమణ



ములకలచెరువు, జూలై 21: తంబళ్లపల్లె నియోజకవర్గ వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడిగా బుర్రా రమణ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ములకలచెరువులో జరిగిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ వాల్మీకుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తనకు పదవికి ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కలు బాబోయ్...



పీలేరు ఎల్‌బీఎస్ రోడ్డులో కుక్కల విహారం

పీలేరు, జూలై 21: పీలేరు పట్టణంలో గ్రామ సింహాలు యథేచ్ఛగా స్వైర్యవిహారం చేస్తున్నాయి. పట్టణంలోని ఒక ప్రాంతం అని కాకుండా ఎక్కడ చూసినా దర్శనమిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇబ్బుడిముబ్బుడిగా పెరిగిపోతున్న వాటి సంతతిని చూసి వారు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపతున్నారు. పీలేరు పట్టణంలో చికెన్, మటన్ సెంటర్లు, హోటళ్ల సంఖ్య పెరిగి పుష్కళంగా ఆహారం దొరుకుతుండడంతో వీధి కుక్కల సంఖ్య కూడా ఇటీవల విపరీతంగా పెరిగింది. దాదాపు గొర్రెల మందల్లా అవి పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్లలో కనిపిస్తున్నాయి. సాధారణంగా మనుషులు చూస్తే దూరంగా పారిపోయే పరిస్థితి పోయి మనుషుల పైకి, వాహనాలపైకి అవి ఎగబడుతున్నాయి. దీంతో అటు పాదాచారులు, ఇటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో పిల్లల్ని ఒంటరిగా పంపాలంటే భయంగా ఉంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టణంలోని ఎల్‌బీఎస్ రోడ్డు, ఎస్వీ డీలక్స్ రోడ్డు, బీవీరెడ్డి కాలనీ, ఆర్టీసీ, పాత బస్టాండులు, నాగిరెడ్డి కాలనీ, ఆర్టీసీ నల్లగుట్ట, చెన్నారెడ్డి కాలనీ, అజంతా టాకీసు మిట్ట, యల్లమంద క్రాస్ ప్రాంతాల్లో కుక్కల విహారం ఎక్కువగా ఉంటోంది. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి ఓపీలో ప్రతిరోజూ ఓ కుక్క కరిచిన కేసు ఉంటోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్ తెలిపారు.

ఏడాదిలో రెండుమార్లు పట్టినా....

పట్టణంలో కుక్కల బెడద పెరిగిపోవడంతో గ్రామపంచాయతీ అధికారులు ఏడాదిలో రెండుమార్లు వాటిని బంధించే ప్రక్రియను చేపడుతున్నారు. గతంలో వీధి కుక్కలకు లైసెన్సులు జారీ చేసి లైసెన్సు లేని వాటిని కడతేర్చేవారు. ఇటీవల అలా కాకుండా ఒక ఊరిలో పట్టిన కుక్కలను మరో ఊరి పొలిమేరల్లో వదిలేస్తున్నారు. లేదా పీలేరు, వాల్మీకిపురం, కలికిరి వంటి ప్రాంతాల్లో పట్టిన కుక్కలను భాకరాపేట అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. అవి మరలా తమ ప్రాంతాలకు తిరిగి వచ్చేస్తున్నాయని పలువురు వ్యాఖ్యానించారు. అయితే ఇటీవల కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి కూడా వచ్చిందని, సోమవారం నుంచి వాటిని బంధించే ప్రక్రియ చేపడతామని పంచాయతీ సర్పంచ్ జీనత్ షఫీ ఆదివారం తెలిపారు.

పంచాయతీలో వివాదం...

కుక్కల పట్టివేత అంశంపై పీలేరు పంచాయతీ సర్పంచ్ జీనత్ షఫీ, శానిటరీ అధికారి మధ్య వివాదం నడుస్తోంది. కుక్కల బెడదను తప్పించేందుకు తాము వాటి పట్టివేతకు పూనుకుంటే శానిటరీ అధికారి రవి సహకరించడం లేదంటూ సర్పంచ్ ఆరోపిస్తున్నారు. వీరిద్దరి వివాదం కారణంగా సర్పంచ్ ప్రకటించినట్లు కుక్కలు పట్టివేత కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం అవుతుందో లేక వాయిదా పడుతుందో వేచి చూడాలి.

విద్యానిలయాలా..ఒత్తిళ్ల కేంద్రాలా..?

కురబలకోట, జూలై 21: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన విద్యాలయాలు.. విద్యార్థుల పాలిట ఒత్తిళ్ల కేంద్రాలుగా మారాయి. తమ పాఠశాలలోని విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాల్సిన అధ్యాపకులు వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అభం, శుభం తెలియని విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. కురబలకోట మండలం ముదివేడు క్రాస్ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ఇక్కడ విద్యార్థుల కోసం ప్రభుత్వం విద్యతో పాటుగా, వసతి కేంద్రాన్ని నిర్వహిస్తున్నది. ప్రభుత్వం విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను, ఆహ్లాదకరంగా అందించాలని చెపుతున్న ఆ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆ ఒత్తిడిలను భరించలేక చాలా మంది విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే మానేస్తున్నారు. కాగా ఇటీవల కేజీబీవీలో జరిగిన సంఘటనే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. కేజీబీవీలో పని చేస్తున్న అధ్యాపకుల ఒత్తిడిని భరించలేక చదువులు మానేయాలని నిర్ణయించుకున్నారు. ఇటీవల ఇంటి నుంచి వచ్చిన విద్యార్థిని తమతో పాటుగా పారాసెట్ మాల్ మాత్రలను అధిక మొత్తంలో తెచ్చుకుంది. పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని టీసీ టీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. దీంతో తాము కూడా ఇంటికి వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతో మదనపల్లె, సీటీఎం, ములకలచెరువుకు చెందిన ముగ్గురు విద్యార్థులు 9వ తరగతి చదువుతూ హాస్టల్ లోనే ఉన్నారు. వారు మాత్రం క్లాస్‌కు వెళ్లకపోవడంతో అధ్యాపకులు వారి హాస్టల్ గదికి వెళ్లి చూడగా పారాసెట్ మాత్రలు మింగి పడి ఉన్నారు. అధ్యాపక సిబ్బంది దీంతో వారిని హుటాహుటినా మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేయకుండా గోప్యంగా ఉంచారు. ఈ విషయం తెలియడంతో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌భాషా ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విచారించారు. ప్రభుత్వం స్పందించి ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో డీఈవో శివప్రకాష్ రెడ్డి, ఆర్డీవో హరినారాయణ, డీవైఈవో పురుషోత్తం, ఎంఈవో ద్వారకనాథ్, జీసీడీవో రాధమ్మ తదితరులు, ఆసుపత్రి, పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో విద్యార్థులు ఆత్మహత్యకు బాధ్యులై విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎస్‌వో పర్వీన్‌భాను, అకౌంటెట్ రత్నప్రియ, నర్సు భానుప్రియ, హిందీ పండిట్ మస్తానీలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు ఉపాధి హామీ బహిరంగసభ

బి.కొత్తకోట, జూలై 21: బికొత్తకోట మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై బహిరంగసభ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులు, పంపిణీ చేసిన సామాజిక భద్రత పెంచన్ల పంపిణీపై సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన సర్వేలో విషయాలను బహిర్గతం చేస్తుందన్నారు. మండల పరిషత్ సభ్యులు, ఉపాధి సిబ్బంది ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

పీటీఎంలో ఘనంగా అక్కదేవతల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం జూలై 21 : మండల కేంద్రమైన పీటీఎంలో గురుపౌర్ణమిని పురష్కరించుకుని కోనల్లో వెలసిన అక్కదేవతల్లో ఒక్కరైన చిన వీరమల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగిం చారు. పీటీఎంకు చెందిన సప్పగిరి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి అమ్మవారిని పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో, కోలాటలు, చెక్కభజనలతో కోలాహలంగా ఊరే గించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారి ఊరేగిం పును తిలకించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూలై 21:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం సంతానలక్ష్మి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

'సంజీవిని' వైద్య శిబిరంలో 171మందికి వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, జూలై 21: 'సంజీవని' పేరిట అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శ్రీనివాసచారిటబుల్ ట్రస్టు కేవీపల్లె మండలం గుండ్రేవారిపల్లెలో ఆదివారం నిర్వహించిన గర్భాశయ క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరంలో 171 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో నిర్వాహకులు 70 మందికి ఉచితంగా పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ నిశ్శబ్ద హంతకుడిలా మారి గ్రామీణ ప్రాంత మహిళల ప్రాణాలను కబళిస్తోందన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే దానికి సులువుగా వైద్యం పొందవచ్చన్నారు. అందు కోసం తాము కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల్లో పెద్దఎత్తున అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, గైనకాలజిస్టులు నిరోషా, విద్య, ప్రీతి, వైద్యులు జిలాని, షమీమ్, ప్రోగ్రాం వలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ, రామాంజనేయులు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వివాహాల పోస్టరు ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, జూలై21: స్థానిక బర్మావీధిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం మాజీ కౌన్సిలర్ మార్పూరి నాగార్జునబాబు(గాంధీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచి త వివాహాల పోస్టర్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత కొన్నేళ్లుగా మార్పురి సీతాలక్ష్మీ, మార్పురి రామచంద్ర జ్ఞాపకార్థ ఉచిత సామూహిక వివాహాలను మార్పురి నాగా ర్జునబాబు నిర్వహించడం ఎంతో సేవా కార్యక్రమం అన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31న షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచినవారు ఆగస్టు 25వ తేదీ లోగా స్థాని క బర్మావీధిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరి న్ని వివరాలకు ప్రసాద్ 9494891559, రాముస్వామి 8309702400కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు, బొమ్మిశెట్టి పురుషోత్తం, జేసీబీ వేణు, మదుసూదనరెడ్డి, రామకృష్ణ, ఎర్రపల్లె వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి వెంకటేశ్వరులు

మదనపల్లె అర్బన్, జూలై21 : అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి. వెంక టేశ్వరులు డిమాండ్ చేశారు . ఆదివారం మదనపల్లి మండలంలోని ప్రకృతివనంలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు అధ్యక్షతన జరిగింది . ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరులు మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను మతోన్మాద శక్తులు పెరగకూడదని సీపీఎం కోరుకుంటోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. కార్యక్రమంలో హరిశర్మ , రామయ్య రమేష్ బాబు , రామచంద్ర, వెంకటయ్య , చలపతి , శేఖర్ నాయక్ , రమణ పాల్గొన్నారు .

సామాజిక సేవకు నగదు వితరణ



మదనపల్లె అర్బన్, జూలై21 : సామాజిక సేవకు గాను స్థానిక చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు సిరికల్చర్ రిటైర్డ్ డైరెక్టర్ రెడ్డివారి దయానంద రెడ్డి మనవడు మాయక్ పుట్టిన రోజు సందర్భంగా 7వేల రుపాయలు నగదు వితరణగా అందచేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎంపి ఆనందన్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. కృష్ణ చరణ్, ట్రెజరర్ పట్నం గిరిజమ్మాల్ పాల్గొన్నారు .

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి

బి.కొత్తకోట, జూలై 21: ఇంటి ముందున్న నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం బి.కొత్తకోటలో జరిగింది. పట్టణంలోని బాబా టాకీస్ వీధికి చెందిన బాబు కుమారుడు నిఖిలేష్(2) ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందున్న నీటి సంపులో పడిపోయాడు. కుటుంబీకులు గమనించకపోవడంతో నీటిలో పడి మృత్యువాత పడ్డాడు.